# ప్రజాశక్తి

శనివారం 30 డిసెంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా






మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల నిరసన; బారికేడ్లను నెట్టుకుని వెళుతున్న అంగన్వాడీలు (అంతర్‌చిత్రంలో)

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



## అంగన్వాడీల సమ్మె ఉధృతం

- మచిలీపట్నంలో ఉద్రిక్తత
- బారికేడ్లను నెట్టుకుని కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ప్రయత్నం
- అడ్డగించిన పోలీసులు
- సమ్మెకు పలు కార్మిక సంఘాల సంఘీభావం

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి**

అంగన్‌వాడీల సమ్మె మరింత ఉధృతమైంది. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో శుక్రవారం వివిధ ప్రజా సంఘాల వారు అంగన్వాడీలకు సంఘీభావం ప్రకటించి అండగా నిలిచారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు వెళుతుండగా, ధర్నాచౌక్ వద్ద పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టారు. పది మందిని మాత్రమే లోనికి అనుమతిస్తామని చెప్పడంతో అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లు నెట్టుకుంటూ ముందుకు సాగించారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు తదితర కార్మిక సంఘాలు, ముఠా కార్మిక సంఘం, ప్రత్యేక హోదా సాధన సమితి, జర్నలిస్టు సంఘాలు సమ్మెకు సంఘీభావం తెలిపాయి. ఆయా సంఘాల ఆధ్వర్యాన లెనిన్ సెంటర్ నుండి ర్యాలీగా అంగన్‌వాడీ సమ్మె శిబిరం వద్దకు చేరుకొని మద్దతు పలికాయి.






విజయవాడలో సమ్మెకు మద్దతు మాట్లాడుతున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు; ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్

# ఉప్పు భూములకు రక్షణ కరువు

**వందల ఎకరాల ఆక్రమణ, ఆక్వా చెరువుల తవ్వకాలు • పెద్దల బినామీలకు పట్టాల పంపిణీకి రంగం సిద్ధం**

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి**

సముద్ర తీర ప్రాంతంలోని మడ అడవులు, ఉప్పు సాగు చేసే భూములకు రక్షణ కరువైంది. రాజకీయంగా అండదండలున్న పెద్దలు వందలాది ఎకరాల భూములను ఆక్రమించేశారు. చెరువులు తవ్వి ఆక్వా సాగు చేపడుతున్నారు. కృత్తివెన్ను మండలం ఇంతేరు సమీపంలోని వందలాది ఎకరాల ఉప్పు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. బినామీల పేరుతో ఈ భూములు స్వాహా చేసేందుకు రంగం సిద్ధం అవుతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం ఇంతేరు వద్ద ఒకటో సర్వే నంబర్‌లో 1400 ఎకరాలు, 53 సర్వే నంబర్‌లో 103 ఎకరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉప్పు భూములున్నాయి. సర్వే నంబర్ 94లో 2000 ఎకరాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. సాల్ట్ భూములు ఐదు సంస్థల ఆధీనంలో ఉండేవి. 2021లో ఈ భూముల లీజులను ప్రభుత్వాలు రద్దు చేశాయి. ఆ తర్వాత సాల్ట్ భూములకు పర్యవేక్షణ కొరవడింది. దీంతో సాల్ట్ భూములు, దానికి మరోవైపు విస్తరించి ఉన్న మడ అడవుల విచ్చలవిడిగా ఆక్రమణకు గురయ్యాయి.

**స్థానికులకు తక్కువ.. పెద్దల బినామీలకే ఎక్కువ !**

ప్రభుత్వ, ఎస్సైన్డ్ తదితర భూములను ప్రభుత్వాలు పేదల జీవనోపాదికి పంపిణీ చేస్తాయి. సాగు హక్కులు కల్పిస్తూ డి ఫారం పట్టాలు కల్పిస్తాయి. ఒక్కొ కుటుంబానికి వ్యవసాయ పంటల సాగుకు 2.5 ఎకరాల వరకు భూమిని కేటాయించే అవకాశం ఉంది. స్థానికుల్లో అర్హులైన వారికే భూములు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఈ గ్రామంలోనిసర్వే నంబర్ 1, 53 సాల్ట్ భూములు స్థానికులకన్నా బినామీల పేరుతో పెద్దలు ఎక్కువ ఆక్రమించారు. రెండేళ్ళల్లో రెండు వందల ఎకరాలు ఆక్రమించారు. ఈ భూములకు ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, ఏలూరుకు చెందిన వారికి డి ఫారం పట్టాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండతో ఈ భూములకు బిఫాం పట్టాలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ భూములకు పట్టాలు ఇస్తామని అధికార పార్టీ నేత భూములు ఆక్రమించిన పెద్దలకు హామి ఇచ్చారని తెలుస్తోంది.

**చెరువుకో రేటు.. విద్యుత్ కనెక్షన్‌కు మరో రేటు**

స్థానికులకు కొద్ది మొత్తంలో భూములు కట్టబెట్టి రాజకీయంగా పలుకుబడి ఉన్న పెద్దలు మడ భూములు, సాల్ట్ భూములు ఆక్రమించారు. తెరవెనుక ఆక్రమణలను ప్రోత్సహించిన అధికారపార్టీకి చెందిన నాయకుడు ఒకరు ఒక్కొ ఎకరాకు రూ. 3 లక్షలు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. సాధారణంగా సాల్ట్ భూములు, మడ అడవుల్లో తవ్విన చెరువుల్లో ఆక్వా సాగుకు విద్యుత్ మోటర్లను అమర్చుకోవడానికి అవకాశం ఉండదు. ఆక్రమణ భూముల్లో విద్యుత్ సంస్థలు కనెక్షన్‌లు మంజూరు చేయవు. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూముల్లోని చెరువులకు విద్యుత్ కనెక్షన్‌లు మంజూరవ్వడం చర్చనీయాంశమైంది. ఒక్కొ ట్రాన్స్‌ఫార్మ్ ఏర్పాటుకు సాధారణంగా మూడులక్షలు చెల్లించాల్సి ఉండగా మరో లక్ష అధనంగా తీసుకుని నాలుగు లక్షలకు ఒక ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

**తీర ప్రాంతానికి ముప్పు**

సముద్ర తీర ప్రాంతాన్ని ఉప్పెనలు, తుఫానుల నుంచి పరిరక్షించడానికి మడ అడవులు దోహదపడతాయని, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ప్రభుత్వం చెప్పే మాటలకు ఆచరణకు పొంతన ఉండటం లేదు. కోడూరు, మచిలీపట్నం, కృత్తివెన్ను మండలంలో తుఫానుల నుంచి సంరక్షణకు ఏర్పాటు చేసిన కరకట్టకు లోపల విస్తరించి ఉన్న మడ అడవులను మూడేళ్ళలోనే పెద్ద మొత్తంలో ధ్వంసం చేశారు. ఈ భూముల్లోనూ చెరువులు తవ్వి ఆక్వా సాగు చేస్తున్నారు. మడ అడవులు, ప్రభుత్వ సాల్ట్ భూములు ఆక్రమణలకు గురవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ

వార్త 6లో

## క్రీడల్లో నైపుణ్యం వెలికితీతకే ఆడుదాం ఆంధ్ర

**ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, ఎంఎల్ఎ వెలంపల్లి, విఎంసి కమిషనర్ దినకర్**

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :**

క్రీడాకారులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. విద్యాధరపురం స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను శుక్రవారం ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రెటరీ యూత్ అడ్వాన్స్మెంట్ టూరిజం అండ్ కల్చర్ ప్రద్యుమ్న, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఈసందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అభివద్ధి చెందుతున్న విజయవాడలో ప్రత్యేకించి పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురంలో నిర్మాణం అవుతున్న స్టేడియం అభివద్ధికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. క్రీడాకారులకు అవసరమయ్యే అన్ని క్రీడలకు అనుగుణంగా ఈ స్టేడియంలో నిర్మాణం అవుతున్నాయని, ప్రస్తుతం ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ కూడా ఇక్కడ జరుగుతోందన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న క్రీడ మైదానంలో దిగి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ ఆడారు. క్రీడాకారులతో ఆడుదాం ఆంధ్ర పోటీల గురించి వివరించి వారిలో క్రీడా స్ఫూర్తిని నింపి ఆడుదాం ఆంధ్ర పోటీలలో సచివాలయం పరిధిలో గెలిస్తే మండలం స్థాయిలో పోటీ ఉంటుందని మండలం స్థాయిలో గెలిస్తే నియోజకవర్గం స్థాయిలో ఉంటుందని ఆ తర్వాత జిల్లా స్థాయిలో చివరిగా రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నారని క్రీడాకారులకు వివరించి పోటీల్లో గెలిచేందుకు అభినందనలు తెలిపారు. విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విద్యాధరపురం స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ అజీజ్, విఎంసి అడిషనల్ కమిషనర్లు కె.శకుంతల, కె.వీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఇఇ నారాయణమూర్తి పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ప్రద్యుమ్న

(వార్తలు లోపలి పేజీల్లో)



విజయవాడలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

## కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

## రూ.90 లక్షల మొబైల్ ఫోన్లు రికవరీ

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి :** పోగొట్టుకున్న 90 లక్షల విలువైన 421 మొబైల్ ఫోను బాధితులకు కష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా శుక్రవారం అందజేశారు. మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటిఎస్) ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సుమారు రూ.50 లక్షల విలువైన 252 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. రెండో పర్యాయం సుమారు రూ.90 లక్షల విలువగల 421 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. సిసిఎస్ డిఎస్పి మురళీకష్ణ, సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది సాయంతో రికవరీ చేసి జిల్లా ఎస్పీ జాషువా చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ అప్లికేషన్ను ప్రజలు అందరూ వినియోగించుకోవాలని, ఫోన్ చోరీకి గురయినా, మిస్ అయిన వారు, ఈ వాట్సాప్ నంబర్ 9490617573 హాయ్ లేద హెల్ప్ అని మెసేజ్ పంపి అడిగిన సమాచారం అందులో నిక్షిప్తపరచి పోలీసు వారి సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్‌పి పి.జాషువా

# అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

## పెరుగుతున్న మద్దతు - పలుకార్మిక సంఘాల సంఘీభావ ర్యాలీలు

**ప్రజాశక్తి-విజయవాడ :** అంగన్వాడీల సమ్మెకు వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలు, జర్నలిస్టు సంఘాలు శుక్రవారం సంపూర్ణ మద్దతు పలికాయి. అంగన్‌వాడీలుచేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరింది. కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు తదితర) కార్మిక సంఘాలు, ముఠా కార్మిక సంఘం, ప్రత్యేక హోదా సాధన సమితి, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపి మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు. ముందుగా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ, జర్నలిస్టు సంఘాలు స్థానిక లెనిన్ సెంటర్‌లో నిరసన తెలిపి, అక్కడి నుంచి ర్యాలీగా అంగన్‌వాడీ సమ్మె శిబిరం వద్దకు చేరుకొని, వారికి మద్దతు పలికారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి గజలక్ష్మీ అధ్యక్షత వహించగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ న్యాయమైన అంగన్‌వాడీల సమ్మెకు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సంపూర్ణ మద్దతు నిస్తుందని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.వి.కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను అతి బలవంతంగా తాళాలు పగలకొట్టిస్తూ...విచ్ఛిన్నకర చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి ఆగడాలను గ్రామాల్లో, పట్టణాల్లో స్థానిక ప్రజలు అంగన్‌వాడీలకు అండగానిలిచి నిలువరిస్తున్నారని అన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర, ప్రత్యేక



తిరువూరులో...

హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, సిపిఎం ఫ్లోర్‌లీడర్, సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, అధ్యక్షులు ఇవి నారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె దుర్గారావు, ఎంవి సుధాకర్, ముఠా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం శీతారాములు పాల్గొన్నారు. **మైలవరం :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా తనకి ఎంపిడిఓ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 18 రోజు కూడా కొనసాగింది. ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాస్తూ తమ కోరికలు నెరవేర్చాలని మైలవరం పురవీధుల్లో ర్యాలీగా వెళ్లి స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద ఉత్తరాలను పోస్ట్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కొండూరు మండల కార్యదర్శి కె బాలకృష్ణ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ శారద, నాలుగు మండలాల్లోని అంగన్వాడీలు హెల్పర్లు పాల్గొన్నారు. **నందిగామ :** అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష మహిళా సంఘం నందిగామ కార్యదర్శి సయ్యద్ బాజిద్.బి ప్రారంభించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుండూరు సుబ్బారావు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, సిఐటియు కార్యదర్శి కె.గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ ఖాసిం ,వేల్పుల ఏసోబు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కె.సరళ ,వెంకట్రావమ్మ, సుజాత, మహాలక్ష్మి వేణు , కాత్యాయని, రాణి తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తిరువూరు తహశీల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.



విజయవాడలో...



మైలవరంలో...



నందిగామలో...




జగ్గయ్యపేటలో

**జగ్గయ్యపేట:** కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ కమల మద్దతిచ్చి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్ నాగమణి, షేక్ గౌస్ మియా, కోటా కష్ణ, రామనాథం, అంగన్వాడి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పలురూపాల్లో కార్మికుల సమ్మె

## న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ - మద్దతిస్తున్న పలు ప్రజా సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-విజయవాడ :** ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె శుక్రవారం నాటికి నాలుగవ రోజుకు చేరింది. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని కార్మికులు చేసిన నినాదాలు మారుమోగాయి. యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ అధ్యక్షత వహించారు. ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వర రావు, సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సిపిఎం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాజకీయపక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, ప్రత్యేక హోదా సాధన కమిటీ కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి మునిసిపల్ కార్మికులన్నా, అంగన్‌వాడీలన్నా, ఇతర కార్మికులు, ఉద్యోగులన్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఆయా విభాగాల్లో పని చేస్తున్న నాలుగు వేల మందికి పైగా మునిసిపల్ కార్మికులు గత నాలుగు రోజుల నుంచి సమ్మె చేస్తుంటే...స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని దుయ్యబట్టారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, పెన్షనర్స్ సంఘం నాయకులు ఎంఎన్ పాత్రుడు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు బిడిఆర్ రెడ్డి, సిఐటియు నాయకులు ఎంవి సుధాకర్, కె దుర్గారావు, టి ప్రవీణ్, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా స్థానిక వెహికల్ డిపోలో గత నాలుగు రోజుల నుంచి కార్మికులు చేస్తున్న ఆందోళనకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా మస్తానవలి మాట్లాడారు. సమస్యలను పరిష్కరించక పోతే మునిసిపల్‌శాఖామంత్రి ఇంటిని ముట్టడిం చాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి సభ్యులు షేక్ ఖాజామొహిద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి .గురునాథం,మీసాల రాజేశ్వరావు, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామలో కొనసాగుతున్న సమ్మెలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. 31 తర్వాత ఇంజనీరింగ్, వీధిలైట్లు, మంచినీళ్లు, వాటర్ వర్క్స్, ఆఫీస్ స్టాఫ్ మొత్తం జనవరి ఒకటో తారీకు నుండి సమ్మెలోకి వస్తారని గురువారం జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపాని చెప్పారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, వేల్పుల ఏసోబు, తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరులో కార్మికులు మెడకు ఉరి తాళ్ళు వేసుకొని నిరసన తెలిపారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి మున్సిపాలిటీ నుండి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వరకు ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్, ఎఐసిటియు నాయకులు జి ప్రసాద్ మాట్లాడారు.



విజయవాడలో



నందిగామలో...



జగ్గయ్యపేటలో...



ఇబ్రహీంపట్నంలో...

## హక్కుల పరిరక్షణపై అవగాహన

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వినియోగదారుల హక్కుల పరిరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లాయర్ (ఏజిపి) పివి సాంబశివరావు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. వస్తువులను విక్రయించేటప్పుడు సేవలపై సమగ్రమైన పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఎటువంటి దోపిడీకి గురికాకుండా వినియోగదారులు మేల్కొనాలని అన్నారు. ఏది ఒరిజినల్ నకిలీనో గుర్తించేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి, కామర్స్ హెచ్ఒడి ఎం.శ్రీనివాసరావు, సీనియర్ ఫ్యాకల్టీ పని కుమార్, కరీముల్లా, నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణమస్తును సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - మైలవరం :** కళ్యాణమస్తును సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి ఛైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి అన్నారు. పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమితి ద్వారా మూడు సంవత్సరాల్లో 180 రోజులకు గాను 180 రోజులు పాలు పోసిన పాల ఉత్పత్తిదారుని గృహంలో వివాహం జరుగుతున్న నేపథ్యంలో వారికి ఇచ్చే రూ.20 వేలు విలువగల బంగారు నాణాన్ని శుక్రవారం లబ్ధిదారునికి అందజేశారు. మండలంలోని కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘంలో పాలు పోసిన వెలుగు పుల్లయ్య కుటుంబానికి ఈ నాణేన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు దళారులకు పాలు పోసి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు అప్పిడి సాంబిరెడ్డి మైలవరం క్లస్టర్ మేనేజర్ టి.యశ్వంత్, వేతన కార్యదర్శి వెంకటరెడ్డి సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల మండలం కొత్తపేట గ్రామంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ధ్యేయం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో అమలు చేసిన జగన్ ప్రజా రంజక పాలన అందించారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో రెండోసారి జగన్‌ను సిఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పత్తిపాటి కృష్ణ, నాయకులు మార్త శ్రీనివాస్, కార్యదర్శి వనిత తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల వినతి

**ప్రజాశక్తి - మైలవరం :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో జరుగుతున్న గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా కార్యక్రమానికి ముందస్తుగా జి.కొండూరు పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపిడిఓ అనురాధకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జి.కొండూరు మండల కార్యదర్శి కె.బాలకష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అన్ని రంగాల్లోని కార్మికులను చిన్న చూపు చూస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫెర్రీ గ్రామంలో గ్రామ ప్రముఖులు నడకుదటి శేషగిరిరావు జ్ఞాపకార్థం వారి కుమారులు ఎన్.ఎస్.ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఫెర్రీ పరిసరాల్లో ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్ అందజేసే ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎన్.ఎస్.ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ రూ.13 లక్షల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఫెర్రీ పరిసర ప్రాంతాల ప్రజలకు రోజుకి సుమారు 2000 క్యాన్ల మంచినీరు ఉచితంగా అందజేసే కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

## ఓట్ల తొలగింపుపై వినతి

**ప్రజాశక్తి - వీరులపాడు :** జుజ్జూరు, పెద్దాపురంలో టిడిపికి చెందిన 53 ఓట్లు తొలగించడాన్ని నిరసిస్తూ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వాటిని వెంటనే పునఃపరిశీలన చేయాలని స్థానిక టిడిపి నేతలతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె వినతిపత్రం అందజేశారు.

# అంగన్‌వాడీల గోడు పట్టదా..!




**ప్రజాశక్తి-గుడివాడ రూరల్**

ముఖ్యమంత్రి కాకముందు నేను విన్నాను.. నేను ఉన్నాను.. అని ఊదరగొట్టిన జగన్‌మోహన్‌రెడ్డికి నేడు అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా పట్టనట్టు ఉండటం రెండు నాల్కుల ధోరణికి నిదర్శనం. అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత 19 రోజులుగా వివిధ రూపాలలో సమ్మె చేస్తున్నా పట్టనట్టు, సమ్మె విరమించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించడం దారుణం. సుప్రీకోర్టు అదేశాలు అమలు చేయాలని, గ్రాట్యూటీ వర్తింపు చేయాలని కోరుతున్న అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది.

### కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

**యెండూరి గీత, యూనియన్ అధ్యక్షురాలు**



అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కారించే వరకు సమ్మె కొనసాగుతోంది. 19 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్యమంత్రికి సమ్మె గురించి తెలియదని చెప్పడం విడ్డూరం. గురువారం పోస్టు కార్డుల ద్వారా నిరసన తెలియజేసాం.

### భీమా సౌకర్యం కల్పించాలి

**తూమేటి వాణి, యూనియన్ కార్యదర్శి**



అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి. అంగన్‌వాడిలు మృతి చెందితే ఈ ఉద్యోగాన్నే నమ్ముకున్న కుటుంబాలు భీమా సౌకర్యం లేకపోవడంతో రోడ్డున పడుతున్నారు. మట్టి ఖర్చులు ఇచ్చి కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం భీమా సౌకర్యంతో ఆదుకోవాలి.

### బెదిరించడం సరికాదు

**అయ్యార్ అమ్మాజీ, గుడ్లవల్లేరు సెక్టార్ నాయకురాలు**



ప్రభుత్వం అంగన్‌వాడీలను బెదిరించడం మంచిది కాదు. మా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. చర్చలకు పిలిచి జీతాలు పెంచం అంటున్నారు. బాలింతలు, గర్భవతులు సమ్మె వల్ల ఇబ్బందులు పడుతున్నారని సమ్మె విరమించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం అని బెదిరించడం మంచిది కాదు. మా న్యాయమైన డిమాండ్లు పరిస్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం.

### ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టని ప్రభుత్వం

**నూనె మేరి, నందివాడ సెక్టార్ నాయకురాలు**



నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వానికి మా న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్ని విజ్ఞప్తులు చేసినా పెడ చెవిన పెట్టింది. గత ప్రభుత్వంలోనే ప్రతి నెల 10,500 జీతం అందుకున్నాం. ఈ ప్రభుత్వంలో రూ.11,500 తీసుకున్నాం. ప్రభుత్వం పెంచింది రూ.1000 మాత్రమే. ఈ జీతంలో పెరిగిన నిత్యవసర ధరలతో బతకగలమా.

## నాడునేడు పనులు పరిశీలన

**ప్రజాశక్తి-కంకిపాడు:** విద్యుతోనే సర్వతో ముఖాభివద్ధి సాధ్యమని డిసీఎంఎస్ చైర్పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. కంకిపాడు మండలం కుందేరు గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి నాడు నేడు ద్వారా చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ టిడిపి పాలనలో ప్రభుత్వ విద్య నిర్లక్ష్యానికి గురైంద న్నారు. చదువు కార్పొరేట్ వ్యాపారంగా మార్చేసిన ఘనత చంద్రబాబుదే అని విమర్శించారు. చదువు ద్వారానే వికాసం, అభివద్ధి సాధ్యమవుతాయని గుర్తించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ అన్నారు. నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడ్డాయన్నారు. విద్యార్థులు వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో రాణించాలని, ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు.



## అమెరికన్ అంకాలజీలో బాలుడికి చికిత్స

**ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ:** కానూరులోని అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ నందు కాంథస్ సార్కమాతో బాదపడుతున్న 13 సంవత్సరాల బాలుడికి విజయవంతంగా చికిత్స అందించినట్లు ఆసుపత్రి మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు. హాస్పటల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుడికి చికిత్స చేయడం ద్వారా క్యాన్సర్ సంరక్షణలో ముఖ్యమైన మైలురాయిని సాధించినట్లు తెలిపారు. పేషెంట్ మార్చి 2022 నుండి ఎడమ కంటి లోపలి భాగంలో కంటి కాంతస్ వద్ద నొప్పి లేకుండా ఉన్న కణితిని కలిగిఉన్నాడన్నారు. రోగ నిర్ధారణ, తరుపరి చికిత్స కోసం అమెరికన్‌ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌కు వచ్చాడన్నారు. వెంటనే వైద్యులు వైద్య పరీక్షలను నిర్వహించి కీమో థెరపీ , రేడియోథెరపీతో కూడిన చికిత్సను అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి రీజనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** మండలంలోని విన్న కోట శివారు జేమ్స్ పేట నుండి చింతలగుంట, కట్టవాని చెరువు పురిటిపాడు, తాడిచర్ల, చినగొన్నూరు గ్రామాలకు వెళ్లే రహదారికి గుడివాడ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము సొంత నిధులతో శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టారు. టిడిపి నాయకులు ఈడే మోహన్, బెజవాడ వెంకయ్య విన్నపంతో టిడిపి అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి ఆధ్వర్యంలో స్థానికుల శ్రమదానంతో కట్టవాని చెరువు వరకు రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ మండలంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారం ఏ .ఈ. ఆర్. ఓ .గానున్న తహాశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాదు శుక్రవారం ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంబంధిత పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలను పరిశీలించారు. అలాగే కొన్ని కేంద్రాలలో చేయవలసిన పనులపై ఆయా బిఎల్‌ఓలకు సూచనలు ఇచ్చారు. 21 గ్రామ పంచాయతీలలోని 54 పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

## పోటాపోటీగా వాలీబాల్ పోటీలు



**ప్రజాశక్తి-గన్నవరం:** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం లో భాగం గా గన్నవరం మండలం లో శుక్రవారం గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో పురుషుల వాలీబాల్ మరియు మహిళల ఖో ఖో పోటీలు జరిగాయి. అలాగే కేసరపల్లిలో క్రికెట్, ఖో ఖో ముస్తాబాద లో షటిల్ బాడ్మింటన్, సూరంపల్లి లో ఖో ఖో పోటీలు గన్నవరం యంపిడిఒ సత్య కుమార్ పర్యవేక్షణ లో ఉత్సాహంగా నిర్వహించినట్లు గన్నవరం నియోజకవర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, మరియు సచివాలయం సిబ్బంది సహకారం తో పోటీలు విజయ వంతంగా కొనసాగుతున్నట్లు నాగరాజు తెలిపారు. కాగా దావాజీగూడెం, గొల్లనపల్లి, వీరపనేనిగూడెం గ్రామాలలో సచివాలయాల స్థాయి పోటీలు ముగిసినట్లు ధనియాల వివరించారు. **గుడ్లవల్లేరు:** క్రీడా పోటీలకు యువత నుండి మంచి స్పందన లభించినట్లు ఎంపిడీవో దారపు శ్రీనివాస్ తెలిపారు. బ్యాడ్మింటన్ ఆటను 17 గ్రామ సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపీపీ కొడాలి సురేష్, తహాశీల్దారు అబ్దుల్ రెహమాన్ మస్తానా పాల్గొన్నారు.

## హామీల అమల్లో ప్రభుత్వం విఫలం : కొనకళ్ల

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపరచడంలో జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని జిల్లా టిడిపి అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు విమర్శించారు. జగన్ ఇచ్చిన హామీలు అమలుపరచడంలో 85 శాతం విఫలమయ్యారంటూ టిడిపి ముద్రించిన పుస్తకాన్ని శుక్రవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో జనసేన మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు 99.5 శాతం అమలు చేశారని ప్రతీ సభలో పదే పదే చెప్పి డబ్బా కొట్టుకుంటున్నారని, వాస్తవానికి 15 శాతం మాత్రమే అమలు చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల జగన్నాథరావు, బచ్చుల సుబ్రహ్మణ్యం, గోపు సత్యనారాయణ, బత్తిన దాస్, తలారి సోమశేఖర్, లంకె శేషగిరి, పివి ఫణి కుమార్, గడ్డం రాజు పాల్గొన్నారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొనకళ్ల నారాయణ

## బి ఫార్మసీ విద్యార్థులకు దిశానిర్దేశం

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్:** బి ఫార్మసీ విద్యార్థులు తాము చదువుతున్న కోర్స్ గురించి గర్వంగా చెప్పుకోవాలని జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా జి.గీతాభాయి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల బి ఫార్మసీ ప్రథమ సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు దిశా నిర్దేశ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థుల ఔషధాల గురించి పూర్తి స్థాయిలో జ్ఞానాన్ని సమపార్జించాలన్నారు. ఔషధం వాడకం వల్ల కలిగే ఉపయోగాలతో పాటు జరిగే నష్టాలు కూడా తెలుసుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో అందరూ ఇళ్లల్లో వుంటే డాక్టర్‌లు, నర్సులు, ఫార్మసీస్టులు ధైర్యంగా ముందుకు వచ్చి విధులు నిర్వర్తించారు అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డా పి.వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న వారే జీవితంలో ముందుకు వెళతారని, ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఆ దిశ గా పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ డీన్ ఆచార్య మారుతి, ఫార్మసీ కళాశాల పి రాంబాబు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వీరబ్రహ్మాచారి

## విద్యార్థులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:** విద్యతోనే సర్వతోముఖాభివద్ధి సాధ్యమని, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతుగా ఆర్థికసహకారం(స్కాలర్షిప్) అందిస్తునా నని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ అన్నారు. బొమ్ములూరు ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు చదువు నిమిత్తం 50 వేల రూపాయల ఆర్థికసాయం ఆయన అందజేశారు. ఏలూరుకు చెందిన సీహెచ్ రవిబాబు, కార్తీక్లను చదువుకు అవసరమైన నగదును ఆయన అందజేశారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఫౌండేషన్ ద్వారా సహకారమందిస్తున్నట్లు పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు.



## సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-మోపిదేవి:** మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణపు పనులను పంచాయతీ సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు ( బుల్లి ) ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలోని గరికిపాటి నాగయ్య ఇంటి వద్ద నుంచి తాడేపల్లి సుబ్రహ్మణ్యం గహం వరకు 118 మీటర్ల మేర 7 లక్షలతో శుక్రవారం రోడ్డు పనులను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు పుప్పాల సతీష్ బాబు (నాని), గరికిపాటి వెంకటేశ్వరరావు, గరికిపాటి నాగబాబు, పి.ఎ. సి.యస్ చైర్మన్ గరికిపాటి గోవిందరాజులు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు రూ.10 వేలు అందజేత

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్:** క్రీడల పట్ల ఆసక్తితో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ప్రోత్సహించాలని రాజా వాసిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాసిరెడ్డి మనోజ్ కుమార్ అన్నారు. బాపులపాడు మండలం ఎస్.ఎన్.పాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయి కిక్బాక్సింగ్ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని రాజా వాసిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం ఆయన అందజేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారంగా పోటీల్లో పాల్గొనేందుకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపసాటి కొండలరావు, వడ్డె శేఖర్, మత్తి రామారావు, కమ్మిలి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

## నేడు 'టివి ప్రకటనల్లో భాషా సంస్కతులు' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** చూడ్డానికి ప్రకటనలు చాలా సాధారణమైన విషయంగా కనిపిస్తాయి కానీ అవి మనల్ని, మన అలవాటుల్ని మార్చేందుకు తప్పనిసరిగా ప్రయత్నిస్తాయని సీనియర్ జర్నలిస్టు, కథా రచయిత డా. వేంపల్లె షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు .మనకు తెలియకుండానే మనలోకి జొరబడి మనల్ని ఆలోచింపజేసేందుకు ప్రయత్నించే ప్రకటనల వెనుక అనేక ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కతిక పరమైన అంశాలతో పాటు భౌతిక, మానసిక అంశాలు ఉంటాయన్నారు. శనివారము సాయంత్రం ఐదు గంటలకు ఆయన రాసిన 'టీవీ ప్రకటనల్లో భాషా సంస్కతులు' అనే పుస్తకం ఆవిష్కరణ పుస్తక మహోత్సవంలో జరగనుందన్నారు.

## జెఎన్‌టియు క్రికెట్ జట్టు ఎంపిక



**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ క్రికెట్ జట్టు ఎంపిక ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ శుక్రవారం తెలిపారు. క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియలో జెఎన్టియుకె పరిధిలోని ఐదు జిల్లాలకు సంబంధించి 35 కళాశాలలకు చెందిన మొత్తం120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియకు జే యన్ టి యు నరసరావుపేట నుండి డాక్టర్ జిపి రాజుతో పాటు సెలక్షన్ కమిటీ మెంబర్స్ గా ఎన్ వీ రాజ్ కుమార్, వివి ఫణీంద్ర వ్యవహరిస్తున్నట్లు మిక్ ఇంజనీరింగ్ కళాశాల పిడి నిమ్మగడ్డ సౌరయ్య తెలిపారు. ఎంపిక కాబడిన జట్టు మిక్ కళాశాలలో శిక్షణ పొంది జనవరి 7 నుండి తమిళనాడు హిందుస్థాన్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. సెలక్షన్ ప్రక్రియను కళాశాల యాజమాన్య సభ్యులు ఎం. సుహాస్, సీఈఓ డి. పాండు రంగారావులు ప్రారంభించారు.

## స్టడీ మెటీరియల్ అందజేత

**ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం :** కొండపల్లిలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో చదువు తున్న పదవ తరగతి విద్యార్థి ని విద్యార్థులకు ప్రభుత్వం స్టడీ మెటీరియల్స్ అందజే స్తుంది. ఈ సందర్భం గా ఉమ్మడి జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి పాల్గొని బాలికలకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సైతం ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పోటీపడే విధంగా స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కెడిసిసి రిటైర్డ్ మేనేజర్ మృతి



**ప్రజాశక్తి- నందిగామ :** ప్రముఖ వ్యాపార వేత్త, కెడిసిసి బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ నర్రంనేని నరసింహారావు శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. నరసింహారావు నందిగామ కెడిసిసి బ్యాంకు మేనేజర్ గా, సూపర్ వైజర్గా దాదాపు 30 సంవత్సరాలకు పైగా సేవలందించారు. నందిగామ లక్ష్మీ ప్రసన్న థియేటర్‌ను 30 సంవత్సరాలుగా నడుపుతున్నారు. అందరు సినిమాల నరసింహారావు అని పిలుస్తుంటారు. నరసింహారావు కు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. నరసింహారావు మతి పట్ల పలువురు

## సిపిఎం అభిమాని ఆలీ మృతి

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ పట్టణానికి చెందిన సిపిఎం సానుభూతి పరుడు మహమ్మద్ అలీ (60) శుక్రవారం మృతి చెందారు. అలీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అలీ ముగ్గురు పిల్లలు వున్నారు. సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, మండూరి శ్రీనివాస్ రావు, దామ్షెదర్ నివాళులు అర్పించారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి- భవానీపురం :** భవానీపురం పరిధిలోని 11 కె.వి.ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా ఈ నెల 30వ తేదీ ఉదయం 9.00 గంటల నుండి 11.00 గంటల వరకు (2 గంటలు) పాటు భవానీపురం పరిధిలోని ఎం.పీ.దాస్ వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్, చెట్ల బజార్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఓటరు జాబితాలో డోర్ నెంబర్లపై వినతి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ల్యాండ్ సెటిల్ మెంట్ ప్రభుత్వ కార్యాల యంలో జరిగిన పశ్చిమ నియోజక వర్గ వివిధ రాజకీయ పార్టీ ప్రతి నిధుల సమావేశంలో ఓటర్ లిస్ట్‌లో డిజిటల్ డోర్ నెం బర్స్‌ను డీకోడ్ చేసి అంకెలతో కూడిన డోర్ నెంబర్స్‌తో ఓటర్ లిస్టు తయారు చేయాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రాజశేఖర్‌కి టిడిపి పశ్చిమ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ యేదుపాటి రామయ్య వినతి పత్రాన్ని అందజేశారు. ఓటర్ లిస్ట్‌లలో డిజిటల్ కోడ్ నెంబర్స్‌తో కూడిన ఓట్లను డీకోడ్ చేసి అంకెలతో కూడిన నెంబర్లను ముద్రిస్తే ఓటర్లు ఎక్కడ ఉండేది తెలుసుకోవచ్చని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను పోలింగ్ స్టేషన్ దగ్గరికి తెప్పించుకోవడంలో ఉపయోగపడుతుందని తెలిపారు.

# సీనియర్ జర్నలిస్ట్ కొండా రాజేశ్వరరావుకు నివాళి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యుజె) విజయవాడ యూనిట్ మాజీ కార్యదర్శి, న్యాయవాది కొండా రాజేశ్వరరావు (55) గురువారం అకాల మృతి చెందిన విషయం విధితమే. శుక్రవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని చిట్టినగర్ మిల్క్ ప్రాజెక్ట్ సమీపంలో గల ఆయన నివాసం నుండి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు జర్నలిస్టు నాయకులు, మిత్రుల అశ్రు నయనాల నడుమ సింగ్‌నగర్‌లో కొండా రాజేశ్వరరావు భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో ఆత్మీయంగా మెలిగే రాజేశ్వరరావు ఆకస్మిక మృతి పట్ల పలువురు జర్నలిస్టులు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కొండ రాజేశ్వరరావు అంత్యక్రియల్లో ఎపిడబ్ల్యూజెఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి. నాథన్, ఏపిడబ్ల్యూజెఎఫ్ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు ఎన్.నరేంద్ర కుమార్, కార్యదర్శి వెంట్రప్రగడ ఉదయ పణికుమార్, ఎపియుడబ్ల్యూజె విజయవాడ నగర అధ్యక్షులు



కొండా రాజేశ్వరరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

చావా రవి, ఐజెయు నాయకులు షేక్ బాబు, ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.రామారావు, దారం వెంకటేశ్వరరావు, ప్రత్యేక రాష్ట్ర సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు, హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు శివరామకృష్ణ, పలువురు జర్నలిస్టు మిత్రులు పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సీనియర్ పాత్రికేయునిగా రాజేశ్వరరావు పత్రికా రంగానికి అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.

## కొండ ప్రాంతాల అభివృద్ధిని విస్మరణ

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** పశ్చిమలోని కొండప్రాంతాల అభివృద్ధిని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గాలికొదిలేసారని టిడిపి పశ్చిమ నాయకులు ఎంఎస్.బేగ్ విమర్శించారు. శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 48వ డివిజన్ అధ్యక్షులు భోగవల్లి నాగబాబు, సెక్రటరీ వెంకట్రావు, తమ్మిన శేఖర్ ఆధ్వర్యంలో చిట్టినగర్ సొరంగం వద్ద వలి వీధి వద్ద నుండి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బేగ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజక వర్గంలోని పేద ప్రజలు కొండప్రాంతంలో ఉంటారని వీరిని సిఎం జగన్ గానీ, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గానీ ఆదుకొనే ప్రయత్నం చెయ్యలేదని విమర్శిం చారు. డివిజన్ అధ్యక్షులు భోగవల్లి నాగ బాబు, యూనిట్ ఇన్చార్జి తమ్మిన శేఖర్ మాట్లాడారు. డివిజన్ సెక్రెటరీ సందక వెంకట్రావు, డివిజన్ నాయకులు ఖాజా, నాగూర్, భోగవల్లి రమేష్, భోగవల్లి శ్రీనివాస్, జిల్లా కార్యాలయ కార్యదర్శి రాధాకృష్ణ, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వ కార్యదర్శికనకారావు, పాల్గొన్నారు.

## ఓటింగ్‌పై అవగాహన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** భారత ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు 84 - జగ్గయ్యపేట నియోజక వర్గ పరిధిలో గల పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లకు వివి.ఎం, వి.వి.పి. ఎ.టిలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. జగ్గయ్యపేట తహాశీల్దారు కార్యాలయంలో 3వ సచివాలయం, సీతారాంపురం, పట్టణం ఏరియా పరిధిలో గల పోలింగ్ స్టేషన్లలో 37,51 పరిధిలో అవగాహన నిర్వహించారు.

## మృతుని కుటుంబానికి సాయం

**ప్రజాశక్తి - వీరులపాడు:** ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన కౌలురైతు గల్లా చిన్నపున్నయ్య కుటుంబానికి స్వచ్ఛంద సేవా సంస్థ వారు రూ.5 వేలు ఆర్థికసాయం 2 నెలలకు సరిపడా వంటసరుకులను అందజేశారు. గత వారం చిన్నపుల్లయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయమై స్పందించిన విజయవాడ నగరానికి చెందిన కిసాన్ శ్రామిక్ సత్సంగ్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు చుక్కపల్లి కోటేశ్వరరావు, ఉప్పాల సుబ్బరాయుడు హైకోర్టు న్యాయవాది పాల్గొన్నారు.

## వాలంటీర్ల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ నగరంలో వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వాలంటీర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట వార్డు వాలంటీర్ల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ వాలంటీర్లు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. నెలకు రూ.18000 వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కోరుతూ వాలంటీర్లు నినాదాలు చేశారు. ధర్నా అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని విఎంసి మేనేజర్



వినతిపత్రం ఇస్తున్న వాలంటీర్లు

బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయమైన వార్డు వాలంటీర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వాలంటీర్లు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన ధరలు, చాలీ చాలనీ వేతనాలతో వాలంటీర్ల కుటుంబాలు కడు దయనీయంగా ఉన్నాయని అన్నారు. ఎటువంటి కారణం లేకుండా విధులు నుంచి తొలగించిన వాలంటీర్లను తక్షణమే విఎంసి అధికారులు విధుల్లోకి తీసుకోవాలని, లేనట్లయితే ఆందోళనను తీవ్రతరం చేస్తారని, వారికి సిఐటియు అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర ప్రధాన కార్యదర్శి యం.బాబురావు పాల్గొన్నారు.

## క్రీడా కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి - వీరులపాడు :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలను అధికారులు సమర్థవంతంగా నిర్వహిం చాలని ఎంపిపి కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. జుజ్జూరు కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించిన టీ షర్టు క్యాప్‌లను మండల పరిధిలోని సచివాలయల సిబ్బందికి అందజేశారు.

## 'ఆడుదాం ఆంధ్రా'

**ప్రజాశక్తి విసన్నపేట :** ఈరోజు మండల కేంద్రమైన విసన్నపేటలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బ్యాడ్మిం టన్ పోటీలను నిర్వహించిన ఎంపీడీవో వెంకట రమణ. ఈ కార్యక్రమంలో పిడి భాస్కర్, పిఇటిలు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అసమర్థతతోనే మునేరుకు దుస్థితి

**ప్రజాశక్తి - వత్సవాయి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అసమర్థత వల్లే మునేరు డ్యామ్‌కి ఈ దుస్థితి ఏర్పడిందని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య విమర్శించారు. శుక్రవారం జగ్గయ్యపేట నియోజకవర్గం పోలంపల్లి మునేరు డ్యామ్‌కి ఏర్పడిన గండిని తెదేపా, సి.పి.ఐ జనసేన, నాయకులతో కలిసి తాతయ్య పరిశీలించారు. అనంతరం లివిలేకరులతో మాట్లాడుతూలి మునేరు డ్యామ్‌కి వచ్చిన వరద వల్ల తెలంగాణ రాష్ట్రంలోని పలు రైతులకు సంబంధించిన పొలాలు మునిగిపోతున్నట్లు వారు అధికారులకు విన్నవించుకున్నారు. సంబంధిత రైతులకు డిసెంబర్ 11 కల్లా నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని పలు రైతులు ఆరోపించారు. వచ్చిన వరద కారణంగా తమ పంట పొలాలు మునిగిపోతున్నట్లు అందుకుగాను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆయకట్టకు గండి పెట్టారు. మునేరు ఆయకట్టుకు గండి పెట్టడంతో వరదంతా వధాగా పోతున్నట్లు దీంతో మునేరు ఆయికట్టు కింద సాగుచేసిన మిరప వరి పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తెలంగాణ రైతులకు పరిహారం ఇవ్వడంతో పాటు మున్నేరు కింద సాగు అవుతున్న రైతులను వెంటనే ఆదుకోవాలని లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని తాతయ్య హెచ్చరించారు.



లక్ష్మీషాను కలిసిన సామినేని, తదితరులు

## ఎపి హౌసింగ్ ఎమ్‌డిని కలిసిన ప్రభుత్వ విప్ ఉదయభాను

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** విజయవాడ హౌసింగ్ కార్యాలయంలో ఏపీ హౌసింగ్ ఎండీ లక్ష్మి షాని రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను శుక్రవారం కలిశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో గహ నిర్మాణాలు చేపట్టిన వారికి అదేవిధంగా సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి త్వరితగతిన బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎండి సానుకూలంగా స్పందించి త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చూస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డ్వామా పిడి సునీత, హౌసింగ్ డి ఈ, ఎ ఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

## లంగర్‌ఖానాలో అన్నదానం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** హజ్రత్ సయ్యద్ షాబుఖారి నిత్యాన్నదాన లంగర్ ఖానాలో కొండపల్లికి చెందిన గుడిపాటి హరికృష్ణ అన్నదానం శుక్రవారం చేశారు. కొండపల్లి పట్టణంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గాను ఆయన సందర్శించారు.

## వేణుగోపాలుని కల్యాణం

**ప్రజాశక్తి-గంపలగూడెం:** నెమలి శ్రీ వేణుగోపాల స్వామివారి కళ్యాణం శుక్రవారం ఘనంగా జరిగినట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. ఈ కళ్యాణంలో ఆరుగురు దంపతులు పీఠంపై కూర్చుని కన్యాదానం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పురోహిత బందం పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - భవానీపురం :** విజయవాడ నగర అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవానిపురం 41వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను శుక్రవారం వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ ఎం.డి.ఇర్ఫాన్, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి వెలంపల్లి క్షేత్ర స్థాయిలో డివిజన్‌లోని ప్రజలను కలుస్తూ పర్యటించారు. అనంతరం 90 లక్షల 31 వేల రూపాయల నిధులతో నిర్మించనున్న పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పలు అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్ అభివద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. దర్గా, బరియల్ గ్రౌండ్ అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నీట మునిగే ప్రాంతాలన్నీ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ ఎండి. ఇర్ఫాన్,40వ డివిజన్ల కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, 43వ డివిజన్ కార్పొరేటర్ బి.కోటిరెడ్డి, వైసీపీ నాయకులు రెహమాన్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభించిన వెలంపల్లి

# 18వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి :** అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 18వ రోజు శుక్రవారం మచిలీపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటిస్తూ కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళుతున్న అంగన్‌వాడీలను మచిలీపట్నం ధర్నా చౌక్ వద్ద బారికేడ్లు అడ్డుపెట్టి పోలీసులు నిలవరించారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి పదిమంది మాత్రమే అనుమతిస్తామని పోలీసులు కార్యకర్తలను అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేట్ వరకు తమ ర్యాలీ కొనసాగిస్తామని చెబుతూ బారికేడ్లు నెట్టుకుంటూ ర్యాలీ ముందుకు సాగించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** అంగన్వాడీల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మీ సత్తా ఏంటో వచ్చే ఎన్నికల్లో చూపించాలని సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు ఆర్. రఘు పిలుపునిచ్చారు. గన్నవరం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట గత 18 రోజులుగా జరుగుతున్న అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు. సీఐటీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ... ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బేతా శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు .**ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులో అంగన్‌వాడీలు తహసీల్దార్‌కి వినతిపత్రం అందించారు. సమ్మె కు తెలుగుదేశం పార్టీ పెనమలూరు నియోజకవర్గమాజీ శాసనసభ్యులు బోడే ప్రసాద్, జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజా తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ దేవినేని రాజా తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, సూదిమాళ్ళ రవింద్ర, పులి శ్రీను,వణుకురు విక్రమ్, చాలావది రాజా, కొండా నాగేశ్వరావు,లు మద్దతు తెలిపారు. కంకిపాడు ప్రాజెక్టుఅధ్యక్ష ్ష,కార్యదర్శులు రేవతి, నళినికుమారి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తాడంకి నరేష్, కనక రత్నం, విజయలక్ష్మి కాలేశ్వరి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** ఉంగుటూరు మండలంలోని ఆత్కూరు సచివాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. సిఐటియు ఉంగుటూరు మండల కార్యదర్శి కే రామరాజు, అంగన్వాడీ నాయకులు సాంబ, వాణి,ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం సాయిబాబు కు వినతి పత్రం అందజేశారు. అలాగే ఉంగుటూరు సచివాయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి ఎ నాగరాజు కి వినతపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు పిల్లి రాజారావు అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు సత్యవతి, లక్ష్మీ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లిలో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచీ ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్లో ధర్నాచేసి, మానవ హారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్ బాబు, మహిళా సమైక్య జిల్లా రత్నకుమారి, పరుచూరి జనార్ధన్, సిపిఎం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మోపిదేవి మండల సిపిఎం పార్టీ కార్యదర్శి బండి ఆదిశేషు మండల సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల, కంఠంనేని జ్యోత్స్నాదేవి, నేతలు జల్లూరి ప్రసాద్, మీర్ రిజ్వాన్, పరుచూరి జనార్దన్, మొవ్వ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. గంగాభవాని ఎస్.విజయలక్ష్మి, చల్లపల్లి సెక్టార్ నేత సిహెచ్ గంగాభవానీ, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండ లాల అంగన్వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలను సిపిఎం నాయకులు బండి ఆదిశేషు ప్రారంభించారు. దీక్షలకు సిపిఎం నాయకులు ధో నే సహదేవుడు కర్ర వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బెజవాడ నాగేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. తెలుగు మహిళ నాయకులు తలసిల స్వర్ణలత బండి కనకదుర్గ దీక్ష చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, కర్ర సుధాకర్, బండే రాఘవ, తెలుగు మహిళ నాయకులు పార్టీ నాయకులు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అంగన్వాడి యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి ఏ నాగమణి కే పాములమ్మ కాశీ హంస గాదే సుశీల కె విజయరాణి, ఎం సుధారాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి -మొవ్వ :** మొవ్వలో అంగన్వాడీలు చప్పట్లు కొట్టి నిరసన తెలిపారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు శీలం నారాయణరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పోలినాయుడు,కరీముల్లా తదితరులు సంఘీభావం తెలిపారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లిలో అంగన్‌వాడీలు బస్టాండ్ దగ్గర శిబిరంలో నిరసన నిర్వహించారు. అసత్య ప్రచారం చేశారని నిరసనగా సాక్షి పేపర్‌ని దహనం చేశారు. పెడన బంటుమిల్లి కుర్తివెన్ను అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు. **పామర్రు :** పామర్రులో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న శిబిరాన్ని పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ కుమార్ సందర్శించి మద్దతు తెలిపారు. ప్రాజెక్టు లీడర్ కె ఉమారాణి, సువర్ణ లత. రత్నశ్రీ. వాణి, జ్యోతి, చిన్నారి నాయకత్వం వహించారు. సిఐటియు నాయకులు గంగాధర్. ముళ్ళపూడి విల్సన్.కె నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో...



బంటుమిల్లిలో..



కంకిపాడులో...



గన్నవరంలో మాట్లాడుతున్న రఘు



పామర్రులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అనిల్‌కుమార్



మొవ్వలో...



ఉంగుటూరులో..

## అంగన్వాడీలకు కలెక్టర్ బెదిరింపు తగదు : సిఐటియు

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి :** అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు బెదిరించడాన్ని సిఐటియు కృష్ణాజిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రవి, మాదల వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమ్మె విరమించి ఒకటో తేదీ నుంచి విధుల్లో చేరకుంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన వర్కర్లను నియమిస్తామని జిల్లా కలెక్టర్ గురువారం బెదిరించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె గురించి మాట్లాడేందుకు ఐసిడిఎస్ పీడీ ద్వారా కలెక్టరేట్ ఛాంబర్‌కు పిలిచిన అంగన్‌వాడీ యూనియన్ నాయకులను కనీసం కూర్చోమని చెప్పకుండానే దోషుల్లా నిలబెట్టి తన ఛాంబర్‌లో కలెక్టర్ మాట్లాడడం పద్ధతికాదని తెలిపారు.

## పదో రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయ మైన డిమాండ్స్ పరిష్కరించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) ఆధ్వర్యంలో కలక్టరేట్ ధర్నా చౌక్ లో చేపట్టిన సమ్మె శుక్రవారానికి 10 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల పి.పోతురాజు ,ఎస్.శివ నాగరాజు లు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఉద్యోగులందరూ ధర్నా చౌక్ నుండి ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి పి.రోజాకు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎల్ రాజేష్ బాబు, ప్రోగ్రామింగ్ కో-ఆర్డినేటర్ ఎం.నాగార్జున, కోశాధికారి ఎం.ప్రశాంతి తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

# కుంగిన అప్రోచ్ బాగుచేయాలని నిరసన

**ప్రజాశక్తి-కోడూరు :** ఉల్లిపాలెం-భవానిపురం వారధి కి రెండు వైపులా ఉన్న అప్రోచ్లు కుంగిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కుంగిపోయిన అప్రోచ్లను బాగు చేయాలని కోరుతూ మండల జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉల్లిపాలెం భవానిపురం వారధి కుంగిపోయిన అప్రోచ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య మాట్లాడుతూ నవంబర్లోనే ఈ వారధి వద్ద ఉన్న కంగిపోయిన అప్రోచ్ గురించి అధికారులకు జనసేన పార్టీ తరపున వినతిపత్రం అందజేశామని, నేటికీ రెండు నెలలు అవుతున్నప్పటికీ కూడా ఎటువంటి పనులు చేపట్టలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి అప్రోచ్ ను బాగు చేయాలని లేకపోతే జనసేనబి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు, పిట్టలంక గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఉమ్మడి కష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, మాజీ ఎంపీపీ మాచర్ల భీమయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు బడే వీరబాబు, మాజీ డిసి వైస్ చైర్మన్ కాగిత రామారావు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న జనసేన నాయకులు



## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక వివిఇనిస్ట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. సీనియర్స్ కి జూనియర్స్ కి మధ్య స్నేహాభావం ఏర్పరచాలని ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఇలాగే నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులంతా ఒక నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యాన్ని చేదించడానికి తమ అంగీత భావం, శ్రమ, కషి, క్రమశిక్షణ వంటి వాటిని ఆయుధాలుగా చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకొని తమ తల్లిదండ్రులను, కళాశాలకు, మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం బి ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న టీ తన్మయి సాంప్రదాయక భారత నాట్యంతో ఆరంభించారు. మొదటి సంవత్సరం చదువుతున్న రోహిణి ఝాన్సీ మరో సాంప్రదాయక నత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం సాంస్కతిక కార్యక్రమాలు, ఆటల పాటలతో సంబరాలు అంబరాన్ని అంటేలా జరిగాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ ఎస్.కె అభినాభీ, బెటర్ టి రవిష, డాక్టర్ బి మోహన్ గాంధీ, డాక్టర్ టి బాలకష్ణ, అధ్యాపకులు కె పరిమళ, డి లావణ్య, ఎ పల్లవి, టి భాగ్యరేఖ, టి కుందన తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో బస్సులు నడపాలని విద్యార్థుల రాస్తారోకో

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** చిన్న పులిపాక,బొడ్డపాడు, తోట్లవల్లూరు, వల్లూరు పాలెం, యాకమూరు, మీదగా ఉయ్యూరు నుంచి విజయవాడ కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సకాలంలో బస్సులు నడపాలని తోట్లవల్లూరు గాంధీ బొమ్మ సెంటర్లో విద్యార్థులు బస్సును ఆపి శుక్రవారం రాత్రి రాస్తారోకో నిర్వహించారు. గతంలో ఉదయం తొమ్మిది గంటలకు కళాశాలకు వెళ్లేందుకు వీలుగా బస్సు నడిపేవారు అని దానిని ప్రస్తుతం రద్దు చేయడంతో కళాశాలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని, దీనిని పునరుద్ధరించి మరలా తొమ్మిది గంటలకు బస్సును నడపాలని, సాయంత్రం కళాశాల నుండి తిరిగి వచ్చే టైంలో కూడా సకాలంలో బస్సులు నడపాలని తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని విద్యార్థులు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఉయ్యూరు డిపో యాజమాన్యం వారు ఫోన్లో విద్యార్థులతో మాట్లాడి సోమవారం నుంచి బస్సులను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

## చీరలు పంపిణీ

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ :** రాష్ట్రాభివద్ధితో పాటు అర్హులైన వారికి సంక్షేమ ు పథకాలను అందించడమే టీడీపీ లక్ష్యమని మండల తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి అన్నారు.బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్లో శుక్రవారం టీడీపీ గన్నవరం ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో క్రిస్మస్, సంక్రాంతి కానుకగా మహిళలకు చీరలు,పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, హనుమాన్ జంక్షన్ టౌన్ పార్టీ అధ్యక్షులు, అట్లూరి శ్రీనివాసరావు, టౌన్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, మజ్జిగ నాగరాజు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-పమిడిముక్కల :** వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రత్యేకాధికాధికారి ఎం. రామచంద్రుడు శుక్రవారం పమిడిముక్కల మండలంలోని చోరగుడి, పమిడిముక్కలలో పర్యటించారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డులు ద్వారా ఉచిత వైద్యం, ఉజ్వలపై గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల తాసిల్దార్ రాజ్యలక్ష్మి, మండల అభివద్ధి అధికారి విటల్ పాల్, చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణకుమారి, ఎం. దుర్గారావు, కొడమంచిలి మహేష్ పాల్గొన్నారు.



నాగేశ్వరరావును సన్మానిస్తున్న సిహెచ్.బాబూరావు, దుర్గారావు

# ఆటో డ్రైవర్ నిజాయితీ

## ఆటోలో మర్చిపోయిన రూ.8 లక్షల బంగారాన్ని తిరిగి ఇచ్చిన వైనం

**ప్రజాశక్తి-విజయవాడ :** ఆటో డ్రైవర్ మానవత్వం చాటుకున్నారు. తన ఆటోలో మరిచిపోయిన రూ.8 లక్షల విలువచేసే బంగారాన్ని సదరు బాధితురాలికి అందజేసి అందరితో శభాష్ అనిపించుకున్నారు. రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు)కు చెందిన నాగేశ్వరరావు నిజాయితీని పలువురు అభినందించారు. విజయవాడ రైల్వే స్టేషన్ పార్సిల్ ఆఫీస్ గేటు ఆటో డ్రైవర్ పోలవరపు నాగేశ్వరరావు విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు పార్సెల్ ఆఫీస్ గేట్ కమిటీ సభ్యులు గత వారం క్రితం తన ఫ్రెండు పెళ్లికి వెళ్లిన సందర్భంగా చేవూరి నవీన అనే పాప తల్లి ఆటోలో కూర్చుని బిడ్డకు పాలిస్తూ ఆటోలో ఎనిమిది తులాల బంగారం మర్చిపోయింది. బంగారం ఎక్కడ పోయిందో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న నవీన వారి కుటుంబ సభ్యులకు ఆటో డ్రైవర్ నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులైన తోటి ఆటో డ్రైవర్ కె. శ్రీనివాస్ కు ఫోన్ చేసి తన ఆటలో బంగారం దొరికిందని తెలియపరచడంతో ఆ కుటుంబం సంతోషం అంతా ఇంతా కాదు. బంగారం నిజాయితీగా అప్పచెప్పిన నాగేశ్వరావుకు కతజ్ఞతలు తెలుపుతూ రైల్వే స్టేషన్ పార్సెల్ ఆఫీస్ గేట్ వద్ద నవీన అన్న చేవూరి సాగర్ నాగేశ్వరరావుకు 10.వేల రూపాయలు నగదు అందజేశారు. ఆటో డ్రైవర్ నాగేశ్వరరావుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్ బాబురావు శాలువా కప్పి పూలదండ వేసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శులు కె.దుర్గారావు, ఎం.హనుమంతరావు పార్సిల్ ఆఫీస్ ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు పి.తిరుపతయ్య, బి.లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు జె. సూర్యనారాయణ, కోశాధికారి బి.వెంకటేశ్వరరావు, ఎం.కొండలరావు, ఎం.భాస్కర్, డి. సతీష్, వి.ఆర్. కె రెడ్డి, డి.కాలేశ్వరరావు పాల్గొన్నారు.

# ఉన్నత చదువుల వారధి విద్యా దీవెన

**ప్రజాశక్తి-విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) :** గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జగనన్న విద్యా దీవెన జిల్లాస్థాయి కార్యక్రమం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం మెగా చెక్‌ను విద్యార్థులకు అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నాలుగో త్రైమాసికంలో 31,482 మందికి రూ. 25.53 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య ప్రాధాన్యాన్ని గుర్తించి ఈ రంగంలో విప్లవాత్మక కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.శివరామకష్ణ, భట్రాజ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి, జిల్లా వక్ఫ్‌బోర్డు



ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, విజయవాడ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బీవీ




విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### పేద పిల్లల విద్యా ఉన్నతికి ప్రభుత్వం కృషి

పేద పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజబాబు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27,606 మంది విద్యార్థులకు 22.20 కోట్ల రూపాయలను పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ కింద ముఖ్యమంత్రి విడుదల చేశారన్నారు. తద్వారా 24,909 మంది తల్లులు లబ్ధి పొందారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నుంచి నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, ముడా ఛైర్మన్ బుర్ర దుర్గాభవానీ, డిప్యూటీ మేయర్ విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షేక్ షాహిద్ బాబు, డిటిడబ్ల్యూ ధూర్జటి ఫణి, పర్యవేక్షకులు బాబురావు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగల సమ్మె

**ప్రజాశక్తి-విజయవాడ :** సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ (సిఐటియు) చేయాలని కోరుతూ ధర్నా చౌక్‌లో జరుగుతున్న సమ్మె శుక్రవారం నాటికి 10వ రోజుకు చేరింది. పలు సంఘాలు, కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని వారు నినాదాలు చేశారు. సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఎపిటియు, ఫ్యాప్టో జిల్లా నాయకులు ఎస్‌కె ఖాసిం, జనసేన పశ్చిమ సిటీ ఇన్‌చార్జి పోతిన మహేష్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఇతర నాయకులు సంపూర్ణ మద్దతునిచ్చి మాట్లాడారు. న్యాయమైన సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోతే ఉద్యమం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు తానేటి విజయ సుగుణ కుమారి,లాహెూరి జ్వాలా నరసింహారావు,కోశాధికారిగా ఎన్.శివ నాయక్ కమిటీ సభ్యులు సుజాత ,గోపి, సిఐటియు నాయకులు ఎంవి సుధాకర్, కె దుర్గారావు, యం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో ఆక్ట్ ఫైబర్ నెట్

## సేవలు ప్రారంభించిన కలెకర్ పి.రాజాబాబు

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి**

దేశ వ్యాప్తంగా పేరుగాంచిన ఆక్ట్ ఫైబర్ నెట్ సేవలను మచిలీపట్నానికి విస్తరించడం హర్షణీయమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. మచిలీపట్నం ఎన్ కన్వెన్షన్ హాలులో యాక్ట్ ఆక్ట్ ఫైబర్‌నెట్ సేవలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెట్వర్క్ అంటేనే డెవలప్‌మెంట్ అన్నారు. అనేక నగరాల్లో ఆక్ట్ అత్యంత నాణ్యమైన బ్రాడ్ బ్రాండ్ ఇంటర్‌నెట్ సేవలు అందిస్తోందని, విద్య, వాణిజ్య, పారిశ్రామికరంగాల్లో అభివృద్ధి చెందుతున్న మచిలీపట్నానికి సేవలు విస్తరించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మాధవరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య, ఆక్ట వైస్ ప్రెసిడెంట్ దువ్వూరి యుగంధర్, ఆపరేషన్ హెడ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.





# గణనీయంగా తగ్గిన నేరాలు

## -నేర సమీక్షలో కృష్ణాజిల్లా ఎస్‌పి పి.జాషువా

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయడంతో గత ఏడాదికన్నా 2023లో జిల్లాలో నేరాలు సంఖ్య గణనీయంగా తగ్గిందని జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. 2022 సంవత్సరంలో జిల్లాలో 10, 845 కేసులు నమోదవ్వగా 2023 ఏడాది 9,404 కేసులు నమోదయ్యాయని, గత ఏడాదితో పోల్చుకుంటే 13.2 శాతం తగ్గాయని వెల్లడించారు. మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో 2023 నేర సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 2022లో 29 హత్య కేసులు నమోదవ్వగా ఈ ఏడాది 27 నమోదయ్యాయని తెలిపారు. ఆస్తి వివాదాల్లో గత ఏడాది ఒక హత్య జరగిందని, ఈ ఏడాది మూడు హత్యలు జరిగాయని ఈ కేసుల్లో నిందితులను కోర్టుల్లో హాజరుపరిచామని అన్నారు. బందిపోటు కేసుల నమోదు కాలేదని, గత ఏడాదిలాగే దోపిడి కేసులు మూడు నమోదయ్యాయన్నారు. ఇళ్ళకు, కార్యాలయాలకు, దుకాణాలకు కన్నాలు వేసిన నేరాలు గత ఏడాది 113 జరగ్గా ఈ ఏడాది 9.7 శాతం తగ్గి 102 నమోదయ్యాయన్నారు. 2022లో 457 దొంగతనం కేసులు నమోదుకాగా ఈ ఏడాది 4.59 శాతం తగ్గాయని 436 కేసులు నమోదయ్యాయన్నారు. 544 దొంగతనాల కేసుల్లో రూ. 6, 06, 07, 872 విలువైన సొమ్ము చోరీ జరిగ్గా 487 కేసులకు సంబంధించి రూ. 4,42, 87, 942 సొమ్ము 73 శాతం రికవరీ చేశామన్నారు. 2022లో మహిళలపై నేరాలకు సంబంధించి 1617 కేసులు నమోదవ్వగా ఈ ఏడాది 20. 5 శాతం తగ్గి 1,284 కేసులు నమోదయ్యాయన్నారు. దిశ యాప్ ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించి 100, 112 హెల్ప్ నంబర్లపై అవగాహన కల్పించడం, విద్యా సంస్థలపై నిఘా ఏర్పాటు చేయడంతో మహిళలపై నేరాలు తగ్గాయన్నారు. 2022లో బాలలపై 156 లైగింక వేదింపుల కేసులు నమోదవ్వగా ఈ ఏడాది 38.46 శాతం మేర తగ్గి 96 నమోదయ్యాయన్నారు. స్కూల్స్ , హాస్టల్స్, గ్రామాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మొబైల్ వినియోగంపై బాలబాలికలకు అవగాహన కల్పిచడంతో పోస్కో కేసులు తగ్గాయన్నారు. 2022లో 89 ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదవ్వగా ఈఏడాది 20. 68 శాతం కేసులు తగ్గాయన్నారు. 69 నమోదయ్యాయన్నారు. సైబర్ క్రమ్ నేరాలు గత ఏడాది లాగే 77 నమోదయ్యాయన్నారు. లోన్ యాప్‌లపై దృష్టి సారించి వాటి ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది 305 ఎక్సైజ్ కేసులలో 313 మందిని అదుపులోకి తీసుకొని 656.47 లీటర్ల మద్యం తొమ్మిది వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. 181 ప్రొహిబిషన్ కేసుల్లో 195 మందిని అదుపులోకి తీసుకుని 470. 65 లీటర్ల నాటుసారా, 5 వాహనాలు సీజ్ చేశామన్నారు. మాదక ద్రవ్యాల కేసులు ఈ ఏడాది తగ్గాయని గంజాయి విక్రయించిన 84 కేసుల్లో 520 మందిని అదుపులోకి తీసుకుని 655.313 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది 848 రహదారి ప్రమాదాల్లో 285 ప్రమాదాల్లో మరణాలు సంభవించాయన్నారు. 2749 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి రూ. 34, 12, 200 జరిమానా,. మోటర్ వాహనాల చట్టం ప్రకారం 1, 36, 190 చలానాలకు రూ. 3,13, 69,100 జరిమానా విధించామన్నారు. 100, 102 హెల్ప్ సెంటర్‌లకు గత ఏడాది 22,536, ఈ ఏడాది 22, 489 కాల్స్ వచ్చాయన్నారు. కాల్ స్వీకరించిన సంఘటన ప్రాంతానికి చేరుకునే సమయం గత ఏడాది 14 నిమిషాలు ఉండగా ఈ ఏడాది 11 నిమిషాలకు తగ్గిందన్నారు. స్పందనలో 1855 ఫిర్యాదులు రాగా 1788 పరిష్కరించబడ్డాయని, 67 సివిల్ వివాదాలు కోర్టులు ఉన్నాయన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1375 ఫిర్యాదులు స్వీకరించగా సివిల్ వివాదాలు మినహా మిగిలిన 1344 పిర్యాదులకు పరిష్కారం చూపినట్లు తెలిపారు.



అవనిగడ్డలో...

## పలుచోట్ల 'బాబు ష్యూరిటీ'

**ప్రజాశక్తి-కోడూరు** : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లతోనే సాధ్యం అవుతుందని కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఉల్లి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం కోడూరు మండల పరిధిలోని జయపురం గ్రామంలో బాబు షఉరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పూతబోయిన శ్రీనివాసరావు, గోగినేని సోమశేఖర రావు, దామెర్ల నారాయణ, మల్లాది ప్రసాద్, చింతల రమేష్, మేడా శివాజీ, జరుగు నారాయణ స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ ఒకటవ వార్డులో బాబు షిరిడి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి జరగబోయే మేళ్ల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మతి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట్రాం, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కర్ర సుధాకర్, జనసేన పార్టీ నాయకులు రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు

## 7న వికెఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

**ప్రజాశక్తి-గన్నవరం** : గన్నవరం మండలంలోని కేసరపల్లి లో ఉన్న వికేఆర్ కళాశాలలో జనవరి 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్వపు విద్యార్థుల కమిటీ అధ్యక్షులు ఎంవిఎల్ ప్రసాద్, కార్యదర్శి ఎన్ బి ఎం మురళీకష్ణ తెలిపారు. సమ్మేళనంలో కళాశాల అధ్యాపకులు, కళాశాల మేనేజ్మెంట్, పూర్వపు సిబ్బంది అందరూ పాల్గొంటారని చెప్పారు. ఈ కళాశాలలో చదివిన పూర్వపు విద్యార్థి అందరూ హాజరు కావాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

**పెనమలూరు** : వైయస్సార్ తాడిగడప మున్సిపల్ కార్మికులు నాలుగో రోజు కూడా సమ్మెను కొనసాగించారు. ఈ సమ్మెకు రాష్ట్ర కేవీపీఎస్ నాయకులు మాలాద్రి సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా కార్మికులు మోకాళ్లపై నిలుచొని నిరసన తెలిపారు. సిఐటియు పెనమలూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు అధ్యక్షురాలు యలమాల సరళ, మున్సిపాలిటీ సిఐటియు కార్యదర్శి మధిర ఏడు కొండల్‌రావు, తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు కోశాధికారి రత్నకర్ణ, తాడిపత్రి వెంకటరెడ్డి. రామ్ భక్తి సింహాచలం, కంచర్ల పద్మ, కూరగాయని జ్యోతి మేరీ, దోమ ఇందిరా,తమ్మిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.



తాడిగడపలో మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న కార్మికులు



కార్మికుల సమ్మెతో రోడ్డుపైనే చెత్తాచెదారం

# సమ్మెలకు ప్రజాసంఘాల సంఘీభావం



న్యాయవాదులు, మున్సిపల్ వర్కర్స్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు



**ప్రజాశక్తి - గుడివాడ** : ప్రజాసంఘాల ఐక్యవేధిక ఆధ్వర్యంలో గుడివాడలో కొనసాగుతున్న అంగన్‌వాడీలకు, న్యాయవాదులకు, మున్సిపల్ వర్కర్స్‌కు, సర్వశిక్షాభియాన్ ఉద్యోగులకు మద్ధతు తెలిపారు. గుడివాడ ఐసిడిఎస్ కార్యాలయం ముందు 18వ రోజు కొనసాగుతున్న అంగన్‌వాడీలకు, ఏలూరు రోడ్డులోని కోర్టు సముదాయముల ముందు 12వ రోజు నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులకు, అలాగే గుడివాడ మున్సిపల్ కార్యాలయం ముందు 4వ రోజు నిరసన తెలుపుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కి ప్రజాసంఘాల నాయకులు తమ పూర్తి మద్ధతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి, సిఐటియు పట్టణ అధ్యక్షులు తమ్మిశెట్టి లక్ష్మణరావు, గుడివాడ ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్దుల్ హుద్దూస్, ఆంజనేయులు, అబ్దుల్ ఖలీల్, మోహిద్దీన్ బాషా, రెహమాన్, అస్కర్ అలీ, నాగూర్‌మియా, బిల్డింగ్ రంగం పట్టణాధ్యక్ష, కార్యదర్శులు శ్యాంప్రసాద్, రేపాని కొండ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 'బాబు ష్యూరిటీ'తో వైసిపిలో ఆందోళన : టిడిపి

**ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్** :బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీతో వైసిపిలో ఆందోళన మొదలైందని మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడులోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మీద రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాల రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటకు వై.కా.పా ప్రభుత్వం ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించలేకపోయారని విమర్శించారు. కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, బాపులపాడు టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, బాపులపాడు టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు పాల్గొన్నారు.



## పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం:చలసాని

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్** :అత్యధిక పాలసేకరణ ధరతో పాటు సంవత్సరానికి మూడుసార్లు బోనస్ చెల్లిస్తూ పాడిరైతు సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు వాపోయారు. హనుమాన్‌అంక్షన్ క్లస్టర్ పరిదిలోని మద్దాయి గుంట పాలసొసైటీని శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు మేలుజాతి పశువుల కొనుగోలుకు సహకారమందిస్తూ దాణా వచ్చిగడ్డి విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని రైతులు సద్వినియోగు చేసుకోవాలన్నారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, యూనియన్ నుండి పాడిరైతుకు అవసరమైన సహకారం తదితర విషయాలపై రైతుల అభిప్రాయాలను ఆడిగి తెలుసుకున్నారు. కళ్యాణమస్తు లాంటి వినూత్న పదకాలతో పాడిరైతు కుటుంబాలకు యూనియన్ ద్వారా అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని చైర్మన్ వలసాని ఆంజనేయులును పాడిరైతులు మనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్కి రణ్,పాలసొసైటీ అధ్యక్షురాలు వై.కస్తూరి బాయి, సంఘ పాలక వర్గ సభ్యులు, సూపర్ వైజర్లు,పాడి రైతుల పాల్గొన్నారు.

## విద్యార్థులు సమయపాలన పాటించాలి



**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్** : కృష్ణా విశ్వవిద్యా లయం ప్రాంగణం లో ఉన్న ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల ల విద్యార్థులు సమయ పాలన పాటించాని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి హితబోధ చేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల ల విద్యార్థులు నిర్దేశించిన సమయానికి తరగతులకు హాజరు కాని విషయాన్ని గుర్తించిన ఉపకులపతి ప్రత్యేక దష్టి సారించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకే విశ్వవిద్యాలయ ప్రవేశ మార్గం దగ్గర తరగతులకు ఆలస్యంగా వస్తున్న విద్యార్థులకు సున్నితంగా హితబోధ చేశారు. విద్యార్థులు ఆలస్యంగా వస్తున్న విషయాన్ని వారి తల్లి,దండ్రులకు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేశారు. జీవితంలో ఎదగాలి అంటే సమయపాలన పాటించడం అవసరం అని చెప్పారు. విసి తోపాటు రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మాచారి, అర్ట్స్, సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కష్ణా తదితులున్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ




**ప్రజాశక్తి-పమిడి ముక్కల** : చోరగుడి గ్రామంలో ఉపాధి హామీ పని దినాలు పెంచాలని జిల్లా ప్రాజెక్టు అధికారి నర్యానారాయణ అన్నారు. శుక్రవారం పమిడి ముక్కల మండలంలోని ఎండిఒ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ జరిగింది. సామాజిక తనిఖీలు భాగంగా పమిడిముక్కల మండలంలోని తాడంకి, మంటాడ, లంకపల్లి, మేడూరు తదితర గ్రామాలలో ఉపాధి హామీ పనులను రిపోర్టులను జిల్లా అధికారులు పరిశీలించారు. ఎంత శాతం పనులు జరిగాయని పరిశీలించారు. ప్రజలకు ఉపాధి హామీ పనులను కల్పించడంలో సిబ్బంది ముందుండాలని అన్నారు రాబోయే సంవత్సరానికి ముందుగా ప్రణాళికలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు నాంచారరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుందర్రావు, మహేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నష్టం కొండంత... సాయం గోరంత...

- రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం

**ప్రజాశక్తి పెడన** : రైతన్నల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సీత కన్నేసింది. మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు మేమున్నామంటూ సాయం అందించాల్సిన ప్రభుత్వం పట్టినట్లుగా వ్యవహరిస్తుంది. అసలే నష్టాలు నష్టాలు ఊబిలో కంగిపోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ దశలో సర్కారు అరకొరక సహాయంతో ఇచ్చి చేతులు దులుపుకునేందుకు పావులు కదుపుతుంది. వెన్ను తట్టి రైతులు ముందుకు నడిపించాల్సిన ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకకుండా కేవలం 6000 పైచిలుకు మాత్రమే సహాయం అందించేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో రైతు మరింతగా కంగిపోయే అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. అసలే ఓవైపు గత నాలుగేళ్లుగా రబి పంట కూడా లేకపోవడంతో రైతు నడ్డి విరుగుతోంది.

పట్టణ, మండల పరిధిలో మించి తుఫాన్ కారణంగా 5100 హేక్టర్లలో వరి పంట నష్టపోగా మండల పరిధిలోని కాకర్లమూడి, పాలెం, కోటవారిపాలెం,నందమూరు చిన్న నందమురు తదితర గ్రామాల్లో 49 హెక్టార్లు వేరుశనగ పూర్తిగా పాడైపోయిందని అధికారులు రికార్డులు చెబుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం హెక్టారుకు కేవలం 17000 మాత్రమే నష్టపరిహారం చెల్లించేందుకు రంగం సిద్ధం చేశారు. అంటే ఒక్కో ఎకరానికి 6,800 మాత్రమే పరిహారం ఇస్తుంది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు పేర్లు సర్వే నెంబర్లు, ప్రభుత్వం ఇచ్చే ఇన్ పుట్ సబ్సిడీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా మించిన తుఫాన్ కారణంగా మండలంలోని 51,000 వ్యవసాయంలో దాదాపు 20 వేల మంది రైతులు వరి పంట పూర్తిగా నష్టపోయింది. వీరిలో సుమారు 8000 మంది కౌలు రైతులు ఉన్నారు. వీరందరిలో కేవలం వెయ్యి మందికి మాత్రమే కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఉన్నాయి.



దీంతో దాదాపు 7000 మంది కౌలు రైతులను నిరాశే మిగులుస్తుంది. ఖరీఫ్ పంట ఇన్సూరెన్స్ క్లైమ్ భూ హక్కుదారునికే చెందడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

### కోత కోసిన కూలీలకే ఈ డబ్బులు సరిపోవు


**పరసా వీర వెంకటేశ్వరరావు, రైతు**



ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మన కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరిని కోయడానికి కొత్త కూలి రాదు. రైతును ఆదుకోవాలంటే కనీసం రూ.15,000 అయినా ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలి. పైగా అప్పటికే మినుము విత్తనాలను చల్లి చల్లేసినాం. అవి కూడా పూర్తిగా పాడైపోయాయి. ప్రభుత్వం ఇచ్చే ఇన్పుట్ సబ్సిడీ కేవలం చెందిన మినుము విత్తనాలకు కూడా రావు. ఇన్సూరెన్స్ క్లైమ్ ఎప్పుడు వస్తుందో తెలియదు

### భేషరతుగా నష్టపరిహారం అందించాలి

**గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి**



అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులు, కౌలు రైతులను గుర్తించి ఎటువంటి భేషరతులు లేకుండా ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి. ఈ ఏడాది కౌలు ఇచ్చిన రైతు మరో ఏడాది వేరే వారికి ఇస్తాడు. దీనివలన అందరికీ గుర్తింపు కార్డులు ఉండాలంటే సబబు కాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. ముక్కు ఎకరానికి కనీసం 30 వేల అయినా నష్టపరిహారం అందించాలి.

## నేడు టెన్నిస్ పోటీలు ముగింపు



**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** కష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర లయోల కళాశాలలోని టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న దక్షిణ మండల అంతర విశ్వ విద్యాలయాల టెన్నిస్ పురుషుల టోర్నమెంట్ సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, చెన్నై ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం, భారతీయార్ విశ్వవిద్యాలయం జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. శనివారంతో సౌత్ జోన్ టెన్నిస్ పురుషుల టోర్నీ ముగియనుంది. కష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో టెన్నిస్ పురుషుల, ఆర్చరీ పురుషుల మరియు మహిళల, కబడ్డీ మహిళల, బాల్ బ్యాడ్మింటన్ మహిళల, వాలీబాల్ పురుషుల, వాలీబాల్ మహిళల, హ్యాండ్ బాల్ పురుషుల టోర్నీలను నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందని కష్ణా విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డా.జె.నవీన లావణ్య లత పేర్కొన్నారు. టోర్నీల నిర్వహణకు అనుబంధ కళాశాలల సిబ్బంది సహకారం పూర్తిస్థాయిలో అందిస్తున్నారని ఆమె తెలిపారు. శనివారం సాయంత్రం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్, వర్శిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొంటారని కన్వీనర్ డా.జె.వి.నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

## వివంత ఇండస్ట్రీస్ విస్తరణ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** వివంత ఇండస్ట్రీస్ సంస్థ వ్యాపార కార్యకలాపాల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థకు సంబంధించి టెక్ వ్యాపార అవకాశాలు, డ్రోన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఛార్జింగ్ స్టేషన్లు వంటి వ్యాపార వస్తరణకు సంబంధించి ఇప్పటికే సంస్థ పనిచేస్తుందని తెలిపారు. 2013లో ప్రారంభమైన వివంత ఇండస్ట్రీస్ లిమిటెడ్ సివిల్ కన్‌స్ట్రక్షన్, ఇంజనీరింగ్ కంపెనీ అన్నారు. సంస్థ రానున్న కాలంలో మరింత స్థాయిలో టెక్నాలజీని మెరుగుపరచి వ్యాపార విస్తరణకు కృషి చేస్తుందన్నారు.

## లిటిల్ బ్రైన్స్‌లో ఆకట్టుకున్న ప్రదర్శన

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** విజయవాడలోని సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రైన్స్ పాఠశాలలో 'సంపాదించు - ఇతరులకు సాయాన్ని అందించు ' అనే వినూత్నమైన కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు వివిధ రకాలైన పండ్లు, కూరగాయలు, మిఠాయిలతో పాటు వివిధ రకాల ఆహార, ఇతర ఉత్పత్తులను ప్రదర్శించారు. పాఠశాలలో చదివే తల్లిదండ్రులు, వారి బంధువులు ఆసక్తిగా తిలకించి విద్యార్థుల వద్ద నుండి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపల్ సుధ ప్రవీణ మాట్లాడుతూ వస్తువుల క్రయ, విక్రయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే విద్యార్థుల మధ్య స్నేహ, సేవా భావాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. నేటి విద్యార్థులు భవిష్యత్తు తరాల వారసులు అని, రానున్న కాలంలో ఉన్నత చదువుతు చదివి మంచి వ్యాపార దృక్పథంతో కూడా రాణించే విధంగా పాఠశాల స్థాయి నుండే పునాది వేస్తున్నామని తెలిపారు. ఈ వస్తువుల విక్రయాల ద్వారా వచ్చిన నగదును నగరంలోని నిర్మల శిశు భవన్‌కు, అనాథలకు విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.







ప్రజాశక్తి బుక్‌స్టాల్



# సందడిగా పుస్తక ప్రదర్శన

- ఆకట్టుకుంటున్న ప్రజాశక్తి బుక్‌హౌస్ స్టాల్
- పప్పెట్ ట్రీ అట్టబొమ్మల కాన్సెప్ట్‌తో వినూత్న స్టాల్

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన 34వ విజయవాడ పుస్తక మహోత్సవ్ కార్యక్రమంలో సందర్శకులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. సాదారణంగా జనవరి 1వ తేదీ నుండి పుస్తక మహోత్సవ్ ప్రారంభమవుతుంది. అయితే కొత్త సంవత్సరానికి నాలుగు రోజులు ముందుగానే పుస్తక మహోత్సవ్ ప్రారంభమవడంతో నగర వాసులు పుస్తకాల కోసం ఎంతో ఎదరుచూస్తున్నావారికి ముందుగానే పుస్తకాలు కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. తొలిరోజు తక్కువ సంఖ్యలో సందర్శకులు ఉన్నప్పటికీ రెండవ రోజు నుండి సందర్శకుల సంఖ్య పెరిగింది. విజయవాడ పుస్తక మహోత్సవానికి ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా జరిగే ఈ పుస్తకాల పండుగలో విద్యార్థులు, ఉద్యోగస్తులు, యువకులు, మహిళలు తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా మరికొద్ది రోజుల్లో విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. తరువాత వివిధ పోటీ పరీక్షలు కూడా జరుగనున్నాయి. దీనితో విద్యార్థులు జనరల్ నాలెడ్జి పుస్తకాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పుస్తకాలను కూడా కొనుగొలు చేస్తుంటారు.



పప్పెట్ ట్రీ అట్టబొమ్మల ప్రదర్శన

### ఆకట్టుకుంటున్న ప్రజాశక్తి బుక్‌హౌస్ స్టాల్

పుస్తక మహోత్సవ్‌లో ఏర్పాటు చేసిన ప్రజాశక్తి బుక్‌హౌస్ స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. స్టాల్ నెంబర్ 49, 50, 51, 52 స్టాల్స్‌లో అన్ని రకాలైన పుస్తకానలు ఏర్పాటుచేశారు. విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టు పుస్తకాలతో పాటు సైన్సు, సామాజిక అంశాలు సాహిత్య పుస్తకాలతో పాటు డిక్షనరీలు, వివిధ ప్రముఖులు, జనరల్ నాలెడ్జి పుస్తకాలతో పాటు ప్రత్యేకంగా పిల్లల పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. పిల్లల నీతి కథలకు సంబంధించి చిన్నారులలో సైన్సు విజ్ఞానాన్ని పెంపొందించే ఎన్నో రకాలైన పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి.

### పప్పెట్ ట్రీ అట్టబొమ్మల ప్రదర్శన

దీపా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్టాల్ నెంబర్ 100లో పప్పెట్ ట్రీ పేరుతో ఏర్పాటుచేసిన అట్టబొమ్మల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా చిన్నారులు ఈస్టాల్ పట్ల మక్కువ చూపుతున్నారు. ప్రతి ఏటా ఒక వినూత్నమైన కాన్సెప్టుతో పుస్తక మహోత్సవ్‌లో ప్రదర్శనను ఏర్పాటుచేస్తారు. ఈసారి చిన్నారుల్లో ఆసక్తిని కలిగించంతో పాటు వారిలో సృజనాత్మక, ఆలోచనా శక్తిని పెంపొందించే విధంగా పప్పెట్ ట్రీ పేరుతో అట్టబొమ్మలను ఆడిస్తూ ఏవిధంగా పిల్లల ఆలోచనలకు పదును పెట్టాలో తెలియచేసే విధంగా స్క్రీన్లపై చూపుతూ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అభ్యాస విద్యాలయం ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణ మాట్లాడుతూ చిన్నారుల కోసం ప్రత్యేకంగా వినూత్నమైన విధంగా తయారుచేసి పప్పెట్ ట్రీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అంతేకాకుండా కొన్ని బొమ్మలను రూపొందించి అందిస్తున్నామన్నారు. పిల్లలు ఇంటి వద్ద ప్రాక్టీస్ చేస విధంగా చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా వినూత్నమైన కాన్సెప్ట్‌తో తమ సంస్థ పుస్తక మహోత్సవ్‌లో ప్రదర్శన ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

## నేటి కార్యక్రమాలు

సాయంత్రం ఆరు గంటలకు విశాలాంధ్ర పబ్లిషర్స్ పుస్తకావిష్కరణ సభ. 'జనాభా సంఖ్య- అపోహలు - భారత రాజకీయాలు' పుస్తకాన్ని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి వై ఎస్ ఖురేషి ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, మాజీ శాసన సభ్యులు, విశాలాంధ్ర సంపాదకమండలి అధ్యక్షులు కె. రామకష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. శ్రీరమణ ప్రతిభా వేదికపై సాయంత్రం 5 నుండి 8 గంటల వరకు సైన్స్ ప్రయోగాలను విద్యార్థుల అవగాహన కోసం ప్రదర్శిస్తారు.

## ముస్లిం వైతాళికుల్లో అగ్రగణ్యుడు హమీద్ దల్వాయ్

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

భారతదేశంలో ముస్లిం వైతాళికులలో అగ్రగణ్యుడు హమీద్ దల్వాయి అని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. ప్రముఖ మరాఠీ రచయిత హమీద్ దల్వాయ్ అనువాద కథా సంపుటిని విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై శుక్రవారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. సమాజంలో బలహీనులకు అండగా రచనలు, సామాజిక ఉద్యమాలు చేసిన వ్యక్తిగా హమీద దల్వాయా స్వాతంత్ర దేశపు తొలి తరపు ముస్లిం రచయితల్లో ఒకరని ఖాదర్ మొహియుద్దీన్ తెలిపారు. మెజారిటీ దష్టితో మైనారిటీలను చూసి అర్థం చేసుకోవాలని, దాన్ని ముస్లింలకు వివరించి, రెండు వర్గాలకు మధ్య సయోధ్య కుదర్చాలని ఆయన రచనల ద్వారా, కార్యకలాపాల ద్వారా ప్రయత్నించారని చెప్పారు. హమీద్ దల్వాయిని స్థూలంగా అర్థం చేసుకునేందుకు ఆయన కథలు కొంతవరకూ పనికి వస్తాయని ఆయన తెలిపారు. ఎలమి ప్రచురణలు వారు ముద్రించిన ఈ పుస్తకాన్ని రచయిత వెంకట నారాయణ గుండ్ల సమీక్షించారు, ప్రచురణ సంస్థ అధినేత పూర్ణిమా తమ్మిరెడ్డి, ప్రయోక్త మీనా సభను నిర్వహించారు.



కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న మొహియుద్దీన్



అశోకవనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ

## జాతీయ సాంస్కృతిక సమైక్యతకు అనువాదాలే సాధనాలు

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** అనువాదం లేకపోతే జాతీయసమైక్యతా, సాంస్కతిక ఐక్యతా, ప్రపంచ ఐక్యతా లేవని ప్రముఖ రచయిత అనువాదకులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. నగరంలోని పుస్తక మహోత్సవంలో వెన్నా వల్లభరావు రచించిన అశోకవనం పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ భారతీయ భాషా రచన అయినా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకోవాలంటే దానిని హిందీలోకి అనువదించాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత పూజనీయులైన అయిదుగురు శ్రీకష్ణుడు, మహ్మద్ ప్రవక్త, ఏసు క్రీస్తు, బుద్ధభగవానుడు, మహాత్మా గాంధీలలో ముగ్గురు భారతీయులు కావడం మనకు గర్వకారణమన్నారు. వీరిలో బుద్ధభగవానుడికి ప్రపంచ ఖ్యాతి రావడానికి అశోకుడు కారణమన్నారు, వెన్నావల్లభరావు అశోకుడిని తెలుగువారికి పరిచయం చేయడానికి ఉపకరిస్తుందన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మూలరచనకు వన్నె తెచ్చేలా అనువాదం చేయడం వల్లభరావు గొప్పతనమన్నారు. పింగళి వెంకయ్యగారి చరిత్రను త్యాగాలను సాధికారికంగా అందరికీ పరిచయం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. వల్లభరావు తెలుగులో రాసి ఆంగ్లంలోకి అనువదించిన 'పింగళి వెంకయ్య, డిజైనర్ ఆఫ్ ట్రైకలర్' పుస్తకాన్ని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావుగారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అశోక వనం పుస్తకాన్ని సాహితీ పోషకులు గోళ్ల నారాయణరావు, 'పింగళి వెంకయ్య' పుస్తకాన్ని నండూరి రాజగోపాల్ సభకు పరిచయం చేశారు. వర్తమానానికీ, గతానికీ మధ్య నిరంతర సంభాషణే చరిత్ర కనుక ఆ చరిత్రను మరింత చక్కగా అర్థం చేసుకొనేందుకు వెన్నా వల్లభరావు పుస్తకాలు ఉపయోగపడతాయని వారు వివరించారు.